# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-11-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రతి ఒక్కరికీ న్యాయం అందితే సామాజిక న్యాయం అందరికీ అందినట్లేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**

2. **సమాజంలోని కుల అసమానతలను తన రచనలు, కీర్తనలతో రూపుమాపేందుకు భక్త కనకదాస చేసిన కృషి ఎనలేనిదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

3. **ఆపరేషన్ కగార్ తరహా ప్రత్యేక ఆపరేషన్ ద్వారా ఎర్రచందనం అక్రమరవాణాను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటామని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ వెల్లడించారు.**

4. **పత్తి కొనుగోళ్ళలో పాత విధానాన్నే అమలు చేయాలని తెలంగాణా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిసిఐ సిఎండి లలిత్ కుమార్‌ను కోరారు.**

===========================

ప్రతి ఒక్కరికీ న్యాయం అందితే సామాజిక న్యాయం అందరికీ అందినట్లేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో సుప్రీంకోర్టు ప్రాంగణంలో న్యాయ సహాయాన్ని బలోపేతం చేయడంపై నిన్న నిర్వహించిన జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మాట్లాడుతూ.. న్యాయ పరిభాషను సరళీకరించడంతో సామాన్య ప్రజలకు అవలీలగా అర్ధమయ్యేలా చూడాలని కోరారు. న్యాయ శాస్త్ర గ్రంథాల్లో భాషను సరళతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ న్యాయసేవల ప్రాధికార సంస్థ 30వ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటైన ఈ కార్యక్రమంలో.. సామాజిక మధ్యవర్తిత్వంపై శిక్షణ కార్యక్రమాన్ని మోదీ ప్రారంభించారు.

-------------------------

సమాజంలోని కుల అసమానతలను తన రచనలు, కీర్తనలతో రూపుమాపేందుకు భక్త కనకదాస చేసిన కృషి ఎనలేనిదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో కనకదాస జయంతి పురస్కరించుకుని, చిత్రపటానికి ముఖ్యమంత్రి నిన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. కనకదాస తెలుగు, కన్నడ ప్రజలకే కాకుండా, యావత్తు కురుబ సామాజికవర్గానికి ఆరాధ్యుడని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సామాజిక తత్వవేత్తగా, స్వరకర్తగా పేరు పొందారన్నారు. అటువంటి మహనీయుని జయంతిని రాష్ట్రంలో అధికారిక పండుగగా జరుపుకుంటున్నామని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో భక్త కనకదాస జయంతి వేడుకలు మంత్రులు, అధికారులు నిన్న ఘనంగా నిర్వహించారు.

-----------------------------

ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేసే నిబంధన ఎత్తివేయాలని తెలంగాణా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భారత పత్తి సంస్థ – సిసిఐ సిఎండి లలిత్ కుమార్ ను కోరారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల విషయమై సీసీఐ సీఎండీతో మంత్రి నిన్న ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా పత్తి రైతుల ఇబ్బందులను వివరించిన ఆయన.. ఎకరానికి 7 క్వింటాళ్ల పరిమితిపై చర్చించారు. పాత విధానంలో పత్తి కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాపాస్ కిసాన్ యాప్ 24 గంటలు అందుబాటులో ఉంచాలని, పత్తి మిల్లులన్నీ వెంటనే తెరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 20 శాతం తేమ ఉన్న పత్తిని సీసీఐ కొనేలా చర్యలు చేపట్టాలన్నారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లో 'మొంథా తుఫాను' ప్రభావిత జిల్లాల్లో కేంద్ర బృందం రేపటి నుంచి రెండు రోజుల పాటు పర్యటించనుందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడిచింది. రాష్ట్రంలోని ప్రకాశం, బాపట్ల, కృష్ణా, ఏలూరు, తూర్పుగోదావరి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో కేంద్ర బృందం తపాను కారణంగా జరిగిన నష్టాన్ని పరిశీలించనుందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ నిన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి పౌసుమి బసు నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన కేంద్ర బృందం తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనుందని వెల్లడించారు.

-----------------------------

రాష్ట్రంలో రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి సెంచూరియన్ విశ్వవిద్యాలయం దోహదపడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆకాంక్షించారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో రైతు సమ్మేళనం కార్యక్రమాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో అత్యధిక శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు అవసరమైన పరిజ్ఞానాన్ని విశ్వవిద్యాలయం రైతులకు అందించాలన్నారు.

-----------------------------

రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి 60 వేల 799 కోట్ల రూపాయలతో రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలంగాణ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. వీటితో పాటు 28 వేల కోట్ల రూపాయలతో చేపట్టనున్న మన్ననూర్ – శ్రీశైలం హైవే, ఫ్యూచర్ సిటీ – బందరు పోర్ట్ గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు ప్రతిపాదన దశలో ఉన్నాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పనతో బహుళజాతి సంస్థలకు తెలంగాణ కేంద్రంగా మారబోతోందని వెల్లడించారు.

-----------------------------

ఆపరేషన్ కగార్ తరహా ప్రత్యేక ఆపరేషన్ ద్వారా వచ్చే ఏడాదిలోగా ఎర్రచందనం అక్రమరవాణాను

పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటామని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. ఎర్రచందనం స్మగ్లర్లకు ఇది ప్రభుత్వ హెచ్చరికగా పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమంపై ఎంతగా దృష్టి పెడుతుందో, ప్రకృతి సంపదను రక్షించడానికి అంతే ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడేవారు స్వచ్ఛందంగా మానుకోవాలని సూచించారు. 5 జిల్లాల ఎస్పీలు, ఎర్రచందనం స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు, అటవీశాఖ అధికారులతో తిరుపతి కలెక్టరేట్‌లో ఆయన నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్..33 సెకన్లు

-----------------------------

సుస్థిర జలవనరుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా వెంగళాయపాలెంలోని చెరువును దేశానికే ఆదర్శంగా అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. దీనిని పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకోని మిగిలిన గ్రామాలలోను చేపడతామని వెల్లడించారు. చెరువు అభివృద్ధి పనులను కేంద్ర మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వాయిస్..15 సెకన్లు

-----------------------------

ఆస్ట్రేలియాతో జరిగిన టి20ల సిరీస్‌ను భారత జట్టు 2-1తేడాతో చేజిక్కించుకుంది. బ్రిస్బేన్‌లో నిన్న జరగాల్సిన 5వ, చివరి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. తొలుత భారత జట్టు తన ఇన్నింగ్స్ 4.5 ఓవర్లలో వికెట్లేమీ నష్టపోకుండా 52 పరుగులు చేసింది. అనంతరం వర్షం.. అంతరాయం కలిగించడంతో పాటు ఎంతకూ తగ్గకపోవడంతో అంపైర్లు చివరకు ఆటను రద్దు చేశారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ యానాం, దిగువ ట్రోపో ఆవరణంలో ఉత్తర ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకట్రావు పేర్కొంటూ..

వాయిస్ 25 సెకన్లు

తెలంగాణలో రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================